పెద్ద పాపాల గురుంచి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు వచ్చిన ఒక కల

మూలం : మహా ప్రవక్త మహితోక్తులు (అల్- లూలు వల్ మర్జాన్) **(Al-Lulu-wal-Marjaan)**

1467. హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (రజి) కథనం:- సాధారణంగా దైవప్రవక్త (సల్లం) తమ అనుచరుల్ని "మీలోఎవరైనా ఏదైనా కలగన్నారా?" అని అడుగుతారు. దేవుడు తలచిన వ్యక్తి తాను కన్న కలను గురించి దైవప్రవక్త (సల్లం)కు తెలియజేస్తాడు. ఓ రోజు ఉదయం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు - "రాత్రి కలలో నా దగ్గరకు ఇద్దరు దైవదూతలు వచ్చారు. వారు నన్ను లేపి నిలబెట్టి 'పదండి' అన్నారు. నేను వారి వెంట బయలుదేరాను. మేము ఒక వ్యక్తి దగ్గరకు చేరుకున్నాము. అతను పడుకొని ఉన్నాడు. అతని దగ్గర మరొక వ్యక్తి ఒక రాయి ఎత్తుకొని నిలబడ్డాడు. చూస్తే అంతలో ఆ వ్యక్తి ఆ రాతితో పడుకున్న వ్యక్తి తలమీద విసరి కొట్టాడు. దాంతో అతని తల పగిలిపోతుంది. ఆ రాయి అతనికి తగిలి దొర్లుకుంటూ దూరాన పడిపోతుంది. ఆ వ్యక్తి మళ్ళీ ఆ రాతి వెంటబడి దాన్ని ఎత్తుకుంటాడు. దాన్ని తీసుకొని అతను తిరిగొచ్చేలోగా పడుకున్న వాడి తల తిరిగి అతుక్కుపోయి యథాతథంగా ఉంటుంది. ఆ వ్యక్తి మళ్ళీ ఆ రాతిని అతనిపై విసరి కొడ్తాడు. నేనీ దృశ్యం చూసి ఆశ్చర్యపోతూ "సుబ్హానల్లాహ్! వీరిద్దరు ఎవరు? వీళ్ళ వ్యవహారం ఏమిటీ?" అని అడిగాను. ఆ దైవదూతలిద్దరు "(తరువాత చెప్తాం) ముందుకు నడవండి" అన్నారు.

మేము (ముగ్గురం) ముందుకు నడిచాము. కొంతదూరం వెళ్ళి ఒక వ్యక్తి దగ్గరకు చేరుకున్నాము. అతను వెల్లకిలా పడుకొని ఉన్నాడు. మరొక వ్యక్తి ఒక ఇనుప కొక్కెం తీసుకొని అతని తలవైపు నిల్చున్నాడు. అతనా కొక్కాన్ని ఆ వ్యక్తి ముఖంలో ఒకవైపున గుచ్చి ఒక చెంప, ఒక ముక్కు రంధ్రం, ఒక కన్ను చీరిపోయేలా ముచ్చలిగుంత దాకా లాగేస్తాడు. ఆ తరువాత అతను ఆ వ్యక్తి ముఖం రెండో వైపుకు వెళ్తాడు. అటువైపు ముఖ భాగాన్ని కూడా అతను అదే విధంగా చీరేస్తాడు. ఆ పని ముగుస్తుందో లేదో ఇటు వైపు ముఖ భాగం పూర్వంలా యథాతథంగా మారిపోయి ఉంటుంది. ఆ వ్యక్తి మళ్ళీ అతని ముఖాన్ని ఇది వరకటి లాగే చీరేస్తాడు.

ఇది చూసి నేను ఆశ్చర్యపోతూ "సుబ్హానల్లాహ్! వీరిద్దరు ఎవరు? వీరి వ్యవహారం

ఏమిటి?" అని అడిగాను. దానికి దైవదూత లిద్దరు "(తరువాత చెప్తాం) పదండి ముందుకు" అన్నారు. మేము (ముగ్గురం) అక్కడ్నుంచి ముందుకు సాగాము. కాస్సేపటికి కుంపటి లాంటి ఓ పెద్ద గొయ్యి దగ్గరకు చేరుకున్నాము. అక్కడ మాకు రకరకాల అరుపులు, పెడబొబ్బలు విన్పించసాగాయి. మేమా గొయ్యిలోకి తొంగి చూస్తే కొందరు స్త్రీలు, పురుషులు నగ్నంగా కన్పించారు. వారి కాళ్ళ క్రింద నుంచి ఒక అగ్ని జ్వాల పైకి వస్తుంటుంది. ఆ అగ్నిజ్వాలపైకి వచ్చినప్పుడల్లా వారు ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టేవారు. అది చూసి నేను "వీరెవరూ, వీరి వ్యవహారం ఏమిటి?" అని అడిగాను. దానికి దైవదూతలు "(తరువాత చెప్తాం) పదండి ముందుకు" అన్నారు.

ఆ తరువాత మేము ముందుకు నడచి ఒక నది దగ్గరకు చేరుకున్నాము. అది రక్తం మాదిరిగా నిగనిగలాడుతూ ఎర్రగా ఉంది. ఆ నెత్తుటి నదిలో ఒక వ్యక్తి ఈదుతున్నాడు. నది ఒడ్డు మీద మరొక వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతని దగ్గర ఎన్నో రాళ్ళు గుట్టగా పడి ఉన్నాయి. ఈదుతున్న వ్యక్తి ఈదుకుంటూ ఒడ్డు మీద నిలబడిన వ్యక్తి దగ్గరికి వచ్చి నోరు తెరుస్తాడు. ఒడ్డు మీది వ్యక్తి అతని నోట్లోకి ఒక రాయి విసురుతాడు. అతను ఈదుకుంటూ వెళ్ళిపోతాడు. కాస్సేపటికి మళ్ళీ వచ్చి నోరు తెరుస్తాడు. ఒడ్డు మీదున్న వ్యక్తి అతని నోట్లోకి రాయి విసరగానే తిరిగి వెళ్ళిపోతాడు. నేనీ విచిత్రం చూసి "వీరిద్దరు ఎవరు? వీరి వ్యవహారం ఏమిటి?" అని అడిగాను దైవదూతల్ని. దానికి వారు "(తరువాత చెప్తాం) ముందుకు నడవండి" అన్నారు.

అక్కడ్నుంచి మేము మళ్ళీ ముందుకు సాగి అత్యంత భయంకరాకారుడయిన ఒక కురూపి దగ్గరకు చేరుకున్నాము. అంతటి భయంకర కురూపిని మీరెప్పుడూ చూసి ఉండరు. అతని ముందు ఓ అగ్ని గుండం ఉంది. అతనా అగ్నిని ప్రజ్వలింపజేస్తూ దాని చుట్టూ తిరుగుతున్నాడు. నేను దైవదూతల్ని అడిగాను "ఇతనెవరు, ఏమిటీ విశేషం?" అని. దానికి వారు "(తరువాత చెప్తాం) ముందుకు నడవండి" అన్నారు.

మేము ముందుకు సాగి ఒక తోటలోకి ప్రవేశించాము. అందులో పచ్చటి వృక్షాలు దట్టంగా ఉన్నాయి. వాటికి రకరకాల పూలు పూసి ఉన్నాయి. ఆ తోట మధ్యలో ఒక పొడవైన వ్యక్తి ఉన్నాడు. అతను ఎంత పొడుగ్గా ఉన్నాడంటే నేనెంత ప్రయత్నించినా అతని తలను చూడలేకపోయాను. అతని చుట్టూ ఎంతోమంది పిల్లలు ఉన్నారు. అంతమందిని నేనెన్నడూ చూడలేదు. నేను నా సహచరుల్ని "ఈ వ్యక్తి ఎవరు? ఈ పిల్లల సంగతేమిటి?" అని అడిగాను. దానికి వారు "(తరువాత చెప్తాం) ముందుకు పదండి" అన్నారు. అక్కడ్నుంచి మేము ముందుకు నడచి మరొక తోటలోకి చేరుకున్నాము. అది ఎంతో అందమైన తోట. అంతటి అందమైన తోటను నేనెప్పుడూ చూడలేదు. వారిద్దరు నాతో "పైకి వెళ్ళండి" అన్నారు. మేమా తోటలో పైకి ఎక్కిపోయాము. చివరికి ఒక పట్టణం దగ్గరికి చేరుకున్నాము. అది వెండి బంగారు ఇటుకలతో నిర్మించబడిన పట్టణం. మేమా పట్టణ ముఖద్వారం దగ్గరికి వెళ్ళి తలుపు తెరవండని అడిగాము. తలుపు తెరవబడింది. మేము లోపలికి ప్రవేశించాము. అక్కడ మాకు కొందరు విచిత్రమైన మనుషులు కన్పించారు. వారి దేహాలు సగం వీలైనంత మహా అందంగా, సగం పరమ అందవికారంగా ఉన్నాయి. నాతో పాటున్న దైవదూతలు అక్కడి జనంతో "ఆ నదిలోకి

వెళ్ళండి" అని అన్నారు. మాకు సమీపంలో ఒక నది ప్రవహిస్తూ ఉంది. దాని నీరు స్వచ్ఛమైన పాలవలె తెల్లగా ఉంది. ఆ వ్యక్తులు వెళ్ళి నదిలోకి దిగారు. కాస్సేపటికి వారు నది నుండి బయటపడి మా దగ్గరకు తిరిగొచ్చారు. చూస్తే వారి శరీరాల అందవిహీనత పోయి వారు పూర్తిగా పరమ సౌందర్యవంతులుగా మారిపోయారు.

నన్ను పిలుచుకు వచ్చిన దైవదూతలు నాతో మాట్లాడుతూ "ఇది శాశ్వత స్వర్గోద్యాన వనం. ఇదే మీ నిలయం (స్వగృహం)" అని చెప్పారు. నేను అటువైపు తలపైకెత్తి చూస్తే మేఘమాలికలా మెరసిపోతున్న ఒక శ్వేత భవనం కన్పించింది. "ఇది మీ భవనం" అన్నారు దైవదూతలు. నేను వారితో "దేవుడు మీకు శుభం చేకూర్చుగాక! నాకా భవనంలోకి ప్రవేశించడానికి అనుమతి ఇవ్వండి" అని అన్నాను. దానికి వారు "అప్పుడే కాదు (ఇంకా దాని సమయం రాలేదు). మొత్తానికి మీరు అందులో తప్పకుండా ప్రవేశిస్తారు" అని అన్నారు. "సరే, నేనీ రాత్రి చిత్ర విచిత్ర విశేషాలు చూశాను. ఇక వాటిని గురించి వివరించండి" అని అడిగాను నేను. అప్పుడు వారు వినండి అంటూ ఇలా చెప్పారు -

"మొట్టమొదట మీరు తల పగల గొట్టబడుతున్న వ్యక్తిని చూశారు. అతను ఖుర్ఆన్ విద్య నేర్చుకున్నాడు గాని, దాన్ని ఆచరణలో పెట్టలేదు. ఫర్జ్ నమాజు పట్ల అశ్రద్ధ వహించేవాడు. ఆ తరువాత మీరు చూసిన రెండవ వ్యక్తి, అంటే ముచ్చలిగుంత దాకా చెంప, ముక్కు, కళ్ళు, చీల్చబడుతున్న వాడు ఉదయాన్నే ఇంటి నుంచి బయలుదేరి, లేనిపోని పుకార్లు లేవనెత్తి లోకమంతా వ్యాపింప జేస్తుండేవాడు. ఆ తరువాత మీరు కుంపటిలో కాలిపోతున్న నగ్న స్త్రీ పురుషుల్ని చూశారు. వీరు వ్యభిచారానికి పాల్పడినవారు. (నెత్తుటి) నదిలో ఈదుతూ రాళ్ళు తింటున్న వాడు (ప్రపంచంలో ఉండగా) వడ్డీ తిన్నవాడు. అగ్నిని రాజేస్తూ దాని చుట్టు తిరుగుతూ మీకు కనిపించిన భయంకర కురూపి నరక పాలకుడైన మాలిక్. మీరు ఒక తోటలో ఎంతో పొడవైన వ్యక్తిని చూశారు. ఆయన హజ్రత్ ఇబ్రాహీం (అలైహి). ఆయన చుట్టూ గుమిగూడి ఉన్న పిల్లలు, ప్రకృతి ధర్మం (ఇస్లాం)పై చనిపోయిన వారు...."

హదీసు ఉల్లేఖకుని కథనం - కొందరు ప్రవక్త అనుచరులు "దైవప్రవక్తా! బహుదైవారాధకుల పిల్లలు ఎక్కడుంటారు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "బహుదైవారాధకుల పిల్లలు కూడా అక్కడే ఉంటారు" అని అన్నారు.

పోతే, అర్ధ దేహం అందంగా, అర్ధదేహం అంద వికారంగా ఉన్నవారు - వీరు కొన్ని సత్కర్మలు ఆచరించారు. వాటితో పాటు కొన్ని దుష్కర్మలకు పాల్పడి వాటిని కలుషితం చేశారు. అయితే దేవుడు వారిని క్షమించి వేశాడు."

(సహీహ్ బుఖారీ- 91వ ప్రకరణం - తాబీర్, 48వ అధ్యాయం- తాబీరిర్రుయాబాద సలాతిస్సుబ్హి)

Visit http://Teluguislam.net for Authentic Telugu Islamic Resources